నమస్తే తెలంగాణ
సూర్యాపేట
3 | నల్లగొండ, గురువారం 2 మే 2024 | SURYAPET

సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకట్రావ్

హోం ఓటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

- సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, మే 1 : వృద్ధుల కోసం నిర్వహించే హోం ఓటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హోం ఓటింగ్ బృందాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రియాంక, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం సూచనల మేరకు 85 ఏండ్లు పైబడిన వారికి ఇంటి వద్దే ఓటు వేసే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో 692 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. 27 రూట్లు ఏర్పాటు చేశామని, రూట్ల వారీగా 29 బృందాలు హోం ఓటింగ్ నిర్వహిస్తాయన్నారు. ఈ నెల 3, 5 తేదీల్లో హోం ఓటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజు వివిధ కారణాలతో ఓటు వేయని వారికి ఈ నెల 8న మరో అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. నియమించిన బృందాలకు వాహన సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. నియామక బృందాలు ఓటింగ్ సమయంలో సమన్వయం, నిబద్ధతతో పని చేయాలన్నారు.

ఓటరుకు ముందస్తుగా సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, ఎఫ్‌డీఓ రూపేందర్ సింగ్, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, ఎన్నికల పర్యవేక్షకుడు శ్రీనివాసరాజు, మాస్టర్ ట్రైనర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచే 'మండలి' నామినేషన్లు !

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గానికి నోటిఫికేషన్

- నల్లగొండ కలెక్టర్ చాంబర్‌లో ఏర్పాట్లు
- ఉదయం 11 నుంచి మధ్యాహ్న 3గంటల వరకు స్వీకరణ

నల్లగొండ ప్రతినిధి, మే1(నమస్తే తెలంగాణ) : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం ఉపఎన్నికకు గురువారం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కూడా మొదలవుతుంది. మొత్తం 12 జిల్లాలతో కూడిన ఈ నియోజకవర్గంలో పోటీ చేయాలనుకునే అభ్యర్థులంతా నల్లగొండ కలెక్టరేట్‌లోనే తమ నామినేషన్లను సమర్పించాల్సి ఉంది. నల్లగొండ కలెక్టర్ హరిచందన ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. దాంతో నామినేషన్‌ను దాఖలు చేసే అభ్యర్థులు సెలవు దినాలు మినహా మిగతా అన్ని ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. నల్లగొండ కలెక్టర్ చాంబర్‌లో నామినేషన్ల స్వీకరణకు కావాల్సిన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు.

2021 మార్చిలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో తన శాసనమండలి సభ్యత్వ పదవికి గత డిసెంబర్‌లో రాజీనామా చేశారు. దీంతో 2027 మార్చి వరకు మిగిలిన పదవీకాలం కోసం ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నెల 25న కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసింది. నేటి నుంచి లాంఛనంగా నామినేషన్ల స్వీకరణ మొదలుకానుంది. ఉదయం 11గంటలకు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఆ వెంటే నామినేషన్ల కూడా స్వీకరణను ప్రారంభం కానుంది. ఈ నియోజకవర్గం నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి, ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, వరంగల్ అర్బన్, రూరల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, జనగాం పూర్తి జిల్లాలతో పాటు సిద్దిపేట జిల్లాలోని మూడు మండలాలతో విస్తరించి ఉంది. ఈ నియోజకవర్గంలో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులంతా తమ నామినేషన్లను నల్లగొండ కలెక్టరేట్‌లోనే దాఖలు చేయాల్సి ఉంది. 10వ తేదీన నామినేషన్ల పరిశీలన అనంతరం 13వరకు ఉపసంహరణ గడువు విధించారు. అదే రోజు అభ్యర్థుల తుది జాబితా వెల్లడిస్తారు. ఈ నెల 27న పోలింగ్, జూన్ 5న ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 600 పోలింగ్ కేంద్రాలు ఉండగా 4.61లక్షల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారు. ఇప్పటికే ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న రంగంలోకి దిగగా బీఆర్ఎస్, బీజేపీల నుంచి ఒకట్రెండు రోజుల్లో స్పష్టత రావచ్చని సమాచారం. ఈ నెల 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ అనంతరం మండలి ఎన్నికలపై అన్ని పార్టీలు పూర్తి స్థాయిలో దృష్టి సారించే అవకాశాలు ఉన్నాయి.

జిల్లాలో నెలరోజులు పోలీసు యాక్ట్

- సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, మే 1 : శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఈ నెల 1 నుంచి 30 వరకు 30, 30(ఏ) పోలీసు యాక్టు-1861 అమల్లో ఉంటుందని సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా జిల్లాలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, ప్రజా ధనానికి నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదని పేర్కొన్నారు. ఈ విషయంలో పోలీసులకు సహకరించాల్సిందిగా సూచించారు. అనుమతి లేకుండా ఏవైనా కార్యక్రమాలు చేపడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చివ్వెంల మండంలం పాచ్యానాయక్‌తండాలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

ఎగిరేది గులాబీ జెండానే

నల్లగొండ, భువనగిరిలో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం ఖాయం

- కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను ప్రజలు ఎండగడుతున్న వైనమే ఇందుకు నిదర్శనం
- ప్రచారంలో బీఆర్ఎస్ శ్రేణులకు జనం నుంచి అపూర్వ స్పందన
- కేసీఆర్‌ను వదులుకొని తప్పు చేశామనే భావన ప్రజల్లో ఉంది
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- చివ్వెంల మండలం పాచ్యానాయక్‌తండాలో ఇంటింటి ప్రచారం

రామన్నపేటలో రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి , పక్కన ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, చెరుకు సుధాకర్

చివ్వెంల, మే 1 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లో ఎగిరేది గులాబీ జెండానే అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని పాచ్యానాయక్‌తండాలో బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి మద్దతుగా పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని.. నల్లగొండ, భువనగిరిలో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని అన్నారు. ప్రచారానికి వెళ్లిన తమ నాయకులను కలుస్తున్న సబ్బండ వర్గాలు కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను ఎండగడుతున్న వైనమే ఇందుకు నిదర్శమని పేర్కొన్నారు. కేసీఆర్‌ను వదులుకొని తప్పు చేశామనే భావన ప్రజల్లో ఉందన్నారు. కల్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం, రుణమాఫీ వంటి మోసపూరిత వాగ్దానాలకు మోసపోయామని ప్రజలు మదనపడుతున్నట్లు తెలిపారు. కొత్త పథకాలు ఇవ్వకపోగా కేసీఆర్ ఇచ్చినవి కొనసాగించలేని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు పక్కనబెట్టి, ప్రజలకు సంబంధం లేని అంశాలతో కాంగ్రెస్, బీజేపీ నాటకాలు ఆడుతున్నాయని, ఆ నాటకాలను ప్రజలు పసిగట్టారని అన్నారు. ప్రజలకు పాలేందో, నీళ్లేందో స్పష్టంగా అర్థమైందన్నారు. మరోసారి కాంగ్రెస్‌ను నమ్మితే మరిన్ని కష్టాలు కొనితెచ్చుకున్నట్లే అనే భావనలో ప్రజల్లో ఉన్నట్లు చెప్పారు. తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అన్న జగదీశ్‌రెడ్డి.. బీఆర్ఎస్ హయాంలో సంక్షేమ ఫలాలు అందని ఇల్లు లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధరావత్ కుమారీ బాబూనాయక్, జడ్పీటీసీ భూక్యా సంజీవ నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రావి చెట్టు సత్యం, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఊట్కూరి సైదులు, గోవిందరెడ్డి, నాగునాయక్, దస్తగిరి, బాలాజీనాయక్, అనిల్, నాగరాజు పాల్గొన్నారు.

రామన్నపేటలో బీఆర్ఎస్ రోడ్ షోకు పెద్ద ఎత్తున హాజరైన జనం

కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదు

- నిషేధాలు పెట్టినా ప్రజల నుంచి కేసీఆర్‌ను విడదీయ లేరు
- అమలుకాని హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్
- రామన్నపేటలో బీఆర్ఎస్ అభ్యర్థి రోడ్ షో లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

రామన్నపేట, మే 1 : కేసీఆర్‌పై ఎన్ని నిషేధాలు విధించినా ఆయనను ప్రజల నుంచి విడదీయలేరని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ రోడ్ షోలో భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అమలు చేయలేని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి గుణపాఠం చెబుతారని అన్నారు. కేసీఆర్‌పై ప్రజల్లో విశ్వాసం ఉందని, భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. జైళ్లు, కేసులు బీఆర్ఎస్‌కు కొత్తేమీ కాదని, ప్రజల పక్షాన కొట్లాడుతాం, పోరాడుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని నాశనం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో రైతన్నలు, ప్రజలు కరువుతో అల్లాడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకుడు చెరుకు సుధాకర్, మాజీ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం, పార్టీ మండల కార్యదర్శి పోశబోయిన మల్లేశం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావు రాక సందర్భంగా నల్లగొండలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, మందడి సైదిరెడ్డి తదితరులు

రేపు నల్లగొండకు హరీశ్‌రావు

- చండూర్, నల్లగొండలో రోడ్‌షోకు రాక
- నల్లగొండలో ఏర్పాట్లు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల, కిశోర్

నల్లగొండ, మే 1 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శుక్రవారం నల్లగొండ జిల్లాకు రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ చండూర్‌లో సాయంత్రం 5 గంటలకు రోడ్ షో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత సాయంత్రం 6 గంటలకు బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ నల్లగొండ జిల్లా కేంద్రంలో రోడ్ షో చేపట్టనున్నారు. హైదరాబాద్ రోడ్ వివేకానంద విగ్రహం నుంచి క్లాక్ టవర్ వరకు సాగనున్న రోడ్ షోలో హరీశ్‌రావు మాట్లాడనున్నారు. ఈ సందర్భంగా బుధవారం నల్లగొండలో ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి పరిశీలించారు. వారి వెంట నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు జమాల్ ఖాద్రి, వట్టిపల్లి శ్రీనివాస్, గంజి రాజేందర్ తదితరులు ఉన్నారు.

చెర్వుగట్టు.. సమస్యల గట్టు

- క్షేత్రంలో కనిపించని ఉచిత మరుగుదొడ్లు
- కాలకృత్యాలతో గుట్ట చుట్టంతా కంపుమయం
- పాకూరుపట్టి గుడ్డలతో నిండిన గుడి కోనేరు
- ఎక్కడా లేని విధంగా కొబ్బరి కాయ రూ.50
- భక్తులకు సౌకర్యాలు నిల్.. దోపిడీ ఫుల్

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోనే ప్రముఖ శైవక్షేత్రం.. ప్రతిరోజు వేల మంది దర్శనం.. కోట్లలో ఆదాయం.. కానీ, కనీస వసతులు మృగ్యం. పైగా భక్తుల దోపిడీ అనంతం. ఇది నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి క్షేత్రం దుస్థితి. ఈ శైవ క్షేత్రానికి భక్తుల రద్దీ అధికంగా ఉన్నా కనీస వసతులు లేకపోయినా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఈ క్షేత్రంపై రాత్రి వేళ నిద్రచేసి ఉదయం స్వామివారిని దర్శించుకుంటే అనారోగ్య సమస్యలు తీరుతాయని భక్తుల నమ్మకం. అందుకే అమావాస్య, పౌర్ణమి, సెలవు రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు ఇక్కడికి వస్తారు. ఆ రోజుల్లో గుట్టపై నిద్రించడానికి కొంచెం స్థలం కూడా దొరకదు అంటే అతిశయోక్తి కాదు. భక్తులు వచ్చే వాహనాలతో ఘాట్ రోడ్డు నిండిపోతుంది.

చెర్వుగట్టుపై అపరిశుభ్రంగా ఉన్న వాతావరణం

ఉచిత మరుగుదొడ్లు ఉండవు..

గుట్టపై ముఖ్యంగా ఉచిత మరుగుదొడ్లు లేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉన్న చిన్న పాటి సులభ్ కాంప్లెక్స్ భక్తుల సంఖ్యకు ఏమాత్రం సరిపోవడం లేదు. ముఖ్యంగా మహిళలు చెప్పుకోలేని విధంగా బాధపడుతున్నారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి గంటల తరబడి లైన్లలో నిల్చోవాల్సి వస్తున్నది. నిర్వాహకులు ఒక్కొక్కరి నుంచి రూ.10 తీసుకుంటున్నా.. నిర్వాహణ కూడా సక్రమంగా ఉండటం లేదు. అనేక గదులకు విద్యుత్తు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ బాధ తాళలేక అనేక మంది నీళ్ల బాటిళ్లతో గుట్ట చుట్టపక్కల కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. ఫలితంగా ఆలయ ప్రాంతం అంతా కంపుకొడుతున్నది. ఘాట్ రోడ్డులో రెండుచోట్ల తాత్కాలికంగా మరుగుదొడ్లు నిర్మించినా నీటి వసతి లేక నిరుపయోగంగా మారాయి.

పారిశుధ్యం అధ్వానం

చెర్వుగట్టుపై పారిశుధ్య నిర్వహణ ఘోరంగా ఉన్నది. కొబ్బరి చెక్కలు ఎండబెట్టిన పక్కనే చెత్త కుప్పలు దర్శన మిస్తున్నాయి. ఇక కోనేరు పరిస్థితి మరీ దారుణం. భక్తులు స్నానాలు ఆచరించే కోనేరు నీళ్లు నల్లగా, కంపుకొడుతున్నాయి. అందులోకి దిగితే పాకూరు పట్టి జారుతున్నది. కాళ్లకు గుడ్డలు, ఇతర దుస్తులు తగులుతున్నాయి. డైపర్లను, డ్రాయర్లు కొందరు భక్తులు కోనేరులో, మరికొందరు దాని పక్కనే పడేస్తున్నారు.

భక్తుల నిలువు దోపిడీ

చెర్వుగట్టులో కొందరు వ్యాపారులు భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. భక్తులు తలనీలాల టికెట్‌కు రూ.50 చెల్లిస్తే.. క్షురకులు మరో రూ.50 డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి మెహమాటం లేకుండా రూ.50 ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఏ దేవస్థానంలో లేని విధంగా చెర్వుగట్టులో మాత్రం ఒక్క కొబ్బరి కాయ రూ.50కి విక్రయిస్తున్నారు. చెర్వుగట్టు కింద ఆలయంలో కోడె మొక్కుల వద్ద టికెట్ ధర చెల్లించినప్పటికీ వివిధ వర్గాలవారు అదనంగా డబ్బులు దండుకుంటున్నారు. చెర్వుగట్టు వచ్చే భక్తులు కనీస వసతులు పొందకపోగా దారుణ దోపిడికి, అసౌకర్యానికి గురవుతున్నారు.

ఘాట్‌రోడ్డులో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

కోడ్ ముగియగానే నిర్మాణాలు చేపడుతాం

చెర్వుగట్టులో 50 మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం, నిధులు కూడా మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ కారణంగా పనులు చేపట్టడం లేదు. కోడ్ ముగియగానే మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతాం. చెర్వుగట్టుకు డ్రైనేజీ సమస్య ఉన్నదని, ఈ విషయమై గ్రామస్తులతో చర్చలు జరపుతున్నాం. కోనేరును 15 రోజులకు ఒకసారి శుభ్రం చేస్తామని, కొందరు భక్తులు పసుపు కుంకుమలతో అలాగే కోనేరులోకి దిగడం వల్ల 2-3 రోజులకే నీళ్లు అపరిశుభ్రంగా మారుతున్నాయి. గ్రామ పంచాయతీ వేలం కారణంగా గుట్ట కింద రూ.50 కొబ్బరికాయ విక్రయిస్తున్నారని, గుట్ట మీద రూ.40కే విక్రయిస్తున్నారు. పారిశుధ్య సమస్యను పరిష్కరిస్తాం - సిరికొండ నవీన్, ఆలయ ఈఓ

నిప్పుల కుంపటి

46.5 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు

ఎండలకు నిర్మానుష్యంగా మారిన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి

- ఈ సీజన్‌లోనే రికార్డు స్థాయి నమోదు
- 20 మండలాల్లో 45డిగ్రీలకు పైనే..
- బయటకు వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు

బొడ్రాయిబజార్, మే1 : ఎండలు దంచికొడుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి. జిల్లాలో బుధవారం అత్యధికంగా 46.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సీజన్‌లో ఇదే ఎక్కువ ఉష్ణోగ్రత. ఎండలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఉదయం 8గంటల నుంచే మొదలవుతున్న ఎండ వేడిమి మధ్యాహ్నం వరకు నిప్పుల కుంపటిగా మారుతున్నది. పది గంటలు దాటిందంటే ఇండ్ల నుంచి బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం 35 డిగ్రీలకుపైనే నమోదవుతున్నాయి. రాత్రి 9 గంటలైనా సెగ తగ్గడం లేదు. పలు ప్రాంతాల్లో జనం లేక రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉష్ణోగ్రతలకు ఏసీలు, కూలర్ల వినియోగం భారీగా పెరిగింది. ఎండ సెగకు తట్టుకోలేక చల్లదనం కోసం జనం వెతుకులాడుతున్నారు. వడదెబ్బ తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితి అయితేనే బయటికి రావాలని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లాలోని మునగాల మండల కేంద్రంలో 46.5, అనంతగిరిలో 46.3, పాలకీడు మండలం అలింగపురంలో 46.3, సూర్యాపేటలో 46.2, పెన్‌పహాడ్‌లో 46.0, మోతెలో 45.9, మఠంపల్లిలో 45.8, నూతనకల్‌లో 45.7, మేళ్లచెర్వులో 45.7, ఆత్మకూరు.ఎస్‌లో 45.5, కోదాడలో 45.5, హుజూర్‌నగర్‌లో 45.4, మద్దిరాలలో 45.3, గరిడేపల్లిలో 45.3, చివ్వెంలలో 45.3, నడిగూడెంలో 45.2, చింతలపాలెంలో 45.2, చిలుకూరులో 45.2, నేరేడుచర్లలో 45.0, జాజిరెడ్డిగూడెంలో 44.8, తుంగతుర్తిలో 44.1.. అతి తక్కువగా నాగారం మండలం ఫణిగిరిలో 44.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.